సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 6 । ఆగస్టు । 2025



'స్వచ్ఛ' పనుల పరిశీలన

మంథనిరూరల్: వెంకటాపూర్ గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. గ్రామస్తులు వారిని సన్మానించారు.



కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

ధర్మారం: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలపై వారిని అడిగి తెలుసుకున్నారు.

గరిష్టం/కనిష్టం
33.0/25.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా ఆదివరాహస్వామి జయంతి వేడుకలు



పూజలు చేస్తున్న అర్చకులు

కమాన్‌పూర్(మంథని): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీఆదివరాహస్వామి జయంతి మంగళవారం ప్రారంభమైంది. అర్చకులు ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కాంతరెడ్డి, అర్చకుడు కలకుంట్ల వరప్రసాదచార్యులు తెలిపారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించామని అన్నారు. తహసీల్దార్ వాసంతి, ప్రతినిధులు బొల్లపెల్లి శంకర్‌గౌడ్, ముస్త్యాల దామోదర్, పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచాలి



మాట్లాడుతున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఆసరా పింఛన్లు పెంచాలని, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 13న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ తెలిపారు. వికలాంగుల, వితంతువులు, వృద్ధులతో మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్లు పెంచి చెల్లించాలని ఆయన కోరారు. నాయకులు ఏవూరి వెంకటేశ్వర్‌రావు, ఐరెడ్డి నారాయణరెడ్డి, బైరి రామ్మూర్తి, జయ, స్వరూప, మమత, శంకర్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌పై అవగాహన



శిక్షణ ఇస్తున్న ప్రతినిధులు

గోదావరిఖనిటౌన్: జిల్లాలోని గోదావరిఖని, పెద్దపల్లి, మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు రోబోటిక్స్‌పై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఒకరోజు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. సోహం అకాడమీ సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. గోదావరిఖని, పెద్దపల్లి ప్రిన్సిపాల్స్ జైకిషన్ ఓజ, ఎంఏ శుకూర్ మాట్లాడుతూ, పుస్తకాల్లోని జ్ఞానమేకాకుండా.. దాని వినియోగం, విశ్లేషణ, అన్వయ సామర్థ్యాల గురించి తెలుసుకోవాలన్నారు. సోహం అకాడమీ శిక్షకుడు సంతోష్, టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ సుబ్బారావు, మెంటర్ ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదాముల్లో బ్యాలెట్ బాక్స్‌లు భద్రం



గోదాముల్లోకి తీసుకెళ్తున్న బ్యాలెట్ బాక్స్‌లు

పెద్దపల్లిరూరల్: స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సర్వసన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బ్యాలెట్ పేపర్లు ముద్రించి భద్రపర్చారు. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లను సైతం సిద్ధం చేశారు. ఈక్రమంలో జిల్లాకు 1,650 బ్యాలెట్ బాక్స్‌లు అవసరం కాగా.. గుజరాత్ నుంచి తెచ్చేందుకు ఎంపీవో సుదర్శన్ తదితరులు అక్కడకు వెళ్లారు. మంగళవారం 1,469 బ్యాలెట్ బాక్స్‌లను తీసుకొచ్చారు. వాటిని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాముల్లో భద్రపర్చినట్లు జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య తెలిపారు.

11న గెస్ట్ టీచర్ల ఇంటర్వ్యూలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని 11 మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలు, కాలేజీల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు డెమో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా కన్వీనర్ అంజలి మంగళవారం తెలిపారు. జువాలజీ, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, పీజీటీ మ్యాథ్స్, పీజీటీ ఫిజికల్ సైన్స్, పీజీటీ ఇంగ్లిష్, టీజీటీ ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించే అధ్యాపకులు, ఉపాధ్యాయులు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ (ఎల్ఎండీ కాలనీ) జ్యోతిబా పూలే పాఠశాలలో ఈనెల 11న ఉదయం 10 గంట వరకు హాజరుకావాలని సూచించారు.

కలహాల కమలం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనలో భగ్గుమన్న విభేదాలు
- పదవులు, పెత్తనం కోసం బాహాబాహీ
- స్థానిక ఎన్నికల వేళ వర్గపోరుతో కార్యకర్తల్లో నైరాశ్యం

సాక్షి పెద్దపల్లి:

బీజేపీ అంటే క్రమశిక్షణకు మారుపేరు. కానీ జిల్లా కమలం పార్టీలో అందుకు భిన్న సంస్కృతి నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎదుటే నేతల పోటాపోటీ నినాదాలు, నిరసనల తీరుతో అగ్రనాయకత్వం విస్తుపోయేలా గ్రూపు రాజకీయం రచ్చ తారస్థాయికి చేరింది. సాధారణంగా ప్రతీఅంశాన్ని అంతర్గతంగా చర్చించుకునే కమల దళంలో నాయకులు బహిరంగంగానే విమర్శనాస్త్రాలు సంధిస్తుండడం పార్టీకి నష్టదాయకంగా మారుతున్నాయని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల్లో పార్టీకి సానుకూల స్పందన ఉన్నా.. దానిని ఓట్లరూపంలో మార్చుకోవాల్సిన నేతలు.. బహిరంగంగా కామెంట్లు చేసుకోవడం.. అంతర్గతంగా ఫిర్యాదు చేసుకోవడం ఎక్కువై కమల శిబిరంలో ఏంజరుగుతుందో కేడర్‌కు అంతుచిక్కడం లేదు. వెరిసి జిల్లాలో పార్టీ బలహీనపడేందుకు దారితీస్తుందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మా లీడర్ బండెక్కనిదే ఇంచు కదలదు..

స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కార్యకర్తలను సన్నద్ధం చేసేందుకు జిల్లాకేంద్రంలో బీజేపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల నియమితులైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పెద్దపల్లి కమాన్ వద్ద నిర్వహించిన ర్యాలీలో కాన్వాయ్‌పై ఉన్న అధ్యక్షుడికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు పూలదండ వేయగా, మా నేత, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డిని బండిపైకి ఆహ్వానించరా? అని గుజ్జుల వర్గీయులు ప్రచార రథానికి అడ్డుగా నిల్చొని ఘర్షణకు దిగారు. దుగ్యాల ప్రదీప్‌రావు దిగిపోవాలని గుజ్జుల వర్గీయులు ఆందోళన చేశారు. దీంతో ఇరువర్గాలు తోపులాడుకున్నాయి. పోలీసుల జోక్యం, నేతలు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమనిగింది.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఎదుటే గుజ్జుల, దుగ్యాల వర్గీయుల బాహాబాహీ

జిల్లా అధ్యక్షుడు డౌన్ డౌన్ అంటూ..

తీరా వేదికపైకి వెళ్లాక ఇరువర్గాల నేతల అనుచరులు స్టేజీ ఎదుట ఇరువైపులా నిల్చొన్నారు. సభకు అంతరాయం కలిగించేలా ఎవరికి వారు నినాదాలు చేశారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. పార్టీ చీఫ్ రాంచందర్‌రావు వేదికపై ఉండగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ్‌రెడ్డి మాట్లాడుతుండగా వేదిక ఎదుట నిల్చున్న కార్యకర్తలు.. 'జిల్లా అధ్యక్షుడు డౌన్ డౌన్' అని పెద్దఎత్తున నినాదాలు చేయడం సంచలనంగా మారింది. వేదికపై ఉన్న మాజీ ఎమ్మెల్యే గుజ్జుల పరోక్షంగా దుగ్యాల వర్గంపై మాటలు సంధించారు. తర్వాత మాట్లాడిన దుగ్యాల ప్రదీప్‌రావు సైతం 'చేసేది చెప్పాలి.. చెప్పేదే చేయాలని' చురకలు అంటించారు. జిల్లా అధ్యక్షుడు కలుగజేసుకుని నియోజకవర్గంలో గ్రూప్‌లు లేవని కార్యకర్తలకు తెలియజేసేలా గుజ్జుల, దుగ్యాలను పరస్పరం చేతులు కలిపి సర్దిచెప్పాలని రాష్ట్ర అధ్యక్షుడిని వేదికపై నుంచి కోరడం జిల్లాలో గ్రూప్ రాజకీయాలు ఏస్థాయిలో ఉన్నాయో తెలియజేస్తోంది. మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన బీజేపీలో స్టేజీపైనే పోలీసులను పెట్టుకొని ప్రశాంతంగా సమావేశం నిర్వహించుకోవాల్సిన పరిస్థితి తలెత్తడం ఎంతవరకు సమంజసమని గ్రూప్ రాజకీయాలతో పార్టీకి జరుగుతున్న నష్టం గురించి తెలియజేశారు. పైకి నాయకులంతా కలిసి కట్టుగా ఉన్నట్లు కనిపిస్తున్నా.. వాళ్ల మధ్య పూడ్చలేనంత గ్యాప్ ఉందన్నది పార్టీలో వరుసుగా చోటుచేసుకుంటున్న ఘటనలతో తేటతెల్లమవుతోందని సామాన్య కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.



ఇరువర్గాలను వారిస్తున్న బీజేపీ నేతలు

గాడిన పడేదెలా?

అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటలేకపోయినా గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి గణనీయంగా ఓట్లు వచ్చి రెండోస్థానంలో నిలిచారు. ఇటీవల జరిగిన టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో బీఆర్‌ఎస్‌కు ధీటుగా, కాంగ్రెస్‌ను గద్దె దించి, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని రాష్ట్రస్థాయి నేతలు తరచూ చెబుతున్నారు. కానీ, జిల్లాలో గ్రూప్ రాజకీయాలతో పార్టీ బలహీనపడుతోంది. మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు, గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి ఎవరికివారు కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, తాజాగా బీఆర్‌ఎస్ నుంచి నల్ల మనోహర్‌రెడ్డి బీజేపీ కండువా కప్పుకున్నారు. ఇప్పటికే గ్రూప్‌లుగా మారిన పెద్దపల్లి నియోజకవర్గ బీజేపీ నేతలు.. పదవులు, పెత్తనం కోసం పోటీపడుతున్నారు తప్ప పార్టీ పటిష్టత కోసం శ్రమించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంథని, రామగుండంలో సైతం పాత, కొత్త నేతల మధ్య వర్గపోరు నడుస్తోంది. తాజాగా రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనతోనైనా పార్టీ గాడినపడుతుందని ఆశించిన కార్యకర్తలకు.. ఇరువర్గాల మధ్య విభేదాలు మరింత రచ్చకెక్కడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర నాయకత్వం అందరినీ పిలిపించుకుని, గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా పార్టీని గాడిన పెట్టేలా చర్యలు తీసుకోవాలని కార్యకర్తలు కోరుతున్నారు. తద్వారా వచ్చే స్థానిక సంస్థల్లో.. గత ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా సాధించిన విజయాన్ని కొనసాగించవచ్చని అంటున్నారు.

జిల్లా అభివృద్ధికి కేంద్రం నిధులు

- రూ.20 కోట్లతో పనులు, ప్రజాసంక్షేమం
- హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



అభివాదం చేస్తున్న బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/ధర్మారం: జిల్లాలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల కోసం కేంద్రప్రభుత్వం రూ.20 కోట్లు వెచ్చించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన బీజేపీ జిల్లా స్థాయి పార్టీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశానికి హాజరయ్యారు. తొలుత సుల్తానాబాద్‌లో ఆయనకు ఘనస్వాగతం లభించింది. ఆ తర్వాత లక్సెట్టిపేటలో జరిగే సభకు వెళ్తూ ధర్మారంలో కాసేపు ఆగారు. ఆయా ప్రాంతాల్లో పలువురు పార్టీ నేతలు రాంచందర్‌రావుకు ఘనస్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టుల పేరిట బీఆర్‌ఎస్ నేతలు రూ.వేల కోట్లు దండుకుంటే.. కాంగ్రెస్ సర్కార్.. అవినీతి పేరిట అధికారులను జైళ్లకు పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాగా, బీఆర్‌ఎస్‌కు చెందిన నల్ల మనోహర్‌రెడ్డితోపాటు ఎర్రోళ్ల రాములు, వేల్పుల లక్ష్మీనారాయణ తదితరులు బీజేపీలో చేరారు. ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, నాయకులు కర్రె సంజీవరెడ్డి, గుజ్జుల రామకృష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, వెంకటేశ్‌నేత, మీస అర్జున్‌రావు, కడారి అశోక్‌రావు, సురేశ్‌రెడ్డి, కన్నం అంజయ్య, కామణి రాజేంద్రప్రసాద్, మహేందర్ యాదవ్, కందుల శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, నాగరాజు యాదవ్, తిరుపతి, నారాయణస్వామి, రంజిత్‌రెడ్డి, రాజు, రాంబాబు, సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి ఉన్నారు.

డ్రామాలకు తెరతీస్తున్న బీఆర్‌ఎస్

- ఒక్క ఎకరాకూ సాగునీరు ఇవ్వలేదు
- అందుకే ఆ పార్టీని తిరస్కరించారు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గోదావరిఖని: ప్రాజెక్టుల పేరిట కమీషన్లు దండుకున్న బీఆర్‌ఎస్ నాయకులు.. పాత డ్రామాలకు తెరలేపుతున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. ప్రాజెక్టుల పేరిట ఉమ్మడి జిల్లాలో ఒక్క ఎకరాకు సాగునీరు ఇచ్చిన పాపానపోలేదన్నారు. స్థానిక తిలక్‌నగర్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డ్యాం సేఫ్టీ కమిటీ నిపుణులు ప్రాజెక్టును పరిశీలించి నివేదిక ఇచ్చారని, అందులో నీటిని నిల్వచేస్తే ప్రాజెక్టు కూలిపోతుందని తేల్చి చెప్పారన్నారు. సుందిళ్ల, అన్నారం, కన్నెపల్లి బరాజ్‌ల నుంచి పంటలకు చుక్కనీరు ఇవ్వలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయి గత ఎన్నికల్లో తిరస్కరించారని అన్నారు. కన్నెపల్లి వద్ద మాజీమంత్రులు చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కాళేశ్వరం పేరిట జరిగిన అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వం బహిర్గతం చేస్తోందని అన్నారు. కన్నెపల్లి గేట్లు బద్దలు కొడతామంటూ కమలహాసన్ డైలాగులు చెప్పడం దేనికి సూచిక అని విమర్శించారు. అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోళ్లలో గతంలో జరిగిన పొరపాట్లను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేశ్, బొమ్మక రాజేశ్, కల్యాణి సింహాచలం, ధూళికట్ట సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎఫ్‌ఆర్‌ఎస్'పై శ్రద్ధ చూపాలి

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయులు తమతోపాటు విద్యార్థుల ముఖ ఆధారిత హాజరు నమోదుపై శ్రద్ధ చూపాలని తెలంగాణ మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ సూచించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో డీఈవో మాధవితో కలిసి ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ పీఎంశ్రీ పాఠశాలల హెచ్‌ఎం, సీఆర్పీలతో ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంపై సమీక్షించారు. అంతకుముందు గర్రెపల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఎఫ్‌ఆర్‌ఎస్ పద్ధతి అమలులో జిల్లా రాష్ట్రానికి రోల్ మోడల్‌గా నిలిచిందని ప్రశంసించారు. జిల్లా ప్లానింగ్ అధికారి మల్లేశం తదితరులు ఉన్నారు.

11న నులిపురుగు మాత్రల పంపిణీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఈనెల 11న నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం జరిగిన అధికారుల సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒకటి నుంచి 19ఏళ్లలోపు ఉన్న 2,27,250 మందికి ఈ మాత్రలు అందించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. ప్రోగ్రాం అధికారి కిరణ్‌కుమార్‌తో పాటు వేణుగోపాల్‌రావు, కల్పన, రంగారెడ్డి, వినోద్‌కుమార్, రవీందర్, రమేశ్, రాజగోపాల్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి భరోసా

- ముగిసిన ఆపరేషన్ ముస్కాన్ – 11
- 193 మంది చిన్నారుల గుర్తింపు

'ముస్కాన్-11'లో గుర్తించిన పిల్లలు

విముక్తి పొందిన చిన్నారులు	193
ఇందులో బాలురు	136
బాలికలు	57
నమోదైన కేసులు	180

గోదావరిఖని: బడికి వెళ్లాల్సిన వయసులో బాలకార్మికులుగా పనులు చేయడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇలాంటివారిని గుర్తించి, సంరక్షించేందుకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం చేపట్టింది. ఈక్రమంలోనే ఈసారి చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ -11తో సత్ఫలితాలు సాధించింది. జిల్లావ్యాప్తంగా నెలరోజుల పాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 193 మంది చిన్నారులను గుర్తించి బాలకార్మిక వ్యవస్థ నుంచి విముక్తి కల్పించింది.

రెండు జిల్లాలు.. 193 మంది చిన్నారులు..

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గుర్తించిన మొత్తం 193 మంది చిన్నారుల్లో 71 మంది మంచిర్యాల, 122 మంది పెద్దపల్లి జిల్లాకు చెందిన వారు ఉన్నారు. ఇందులో 21మంది బాలకార్మికులు ఉన్నారు. నిరాశ్రయులైన పిల్లలు, బాలకార్మికులు, భిక్షాటనలో చిక్కుకు పోయిన వారికోసం గత జూలై ఒకటి నుంచి 31వ తేదీ వరకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా నేతృత్వంలో ఓ ఏసీపీకి బాధ్యతలు అప్పగించారు. సబ్ డివిజన్‌కు ఒక ఎస్సైని చొప్పున ఐదుగురిని నియమించారు.



ఆధునిక సాంకేతికతతో..

ఆపరేషన్ ముస్కాన్ కోసం ఈసారి సరికొత్త సాంకేతికతను వినియోగించారు. దర్పన్ అనే ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా తప్పిపోయిన పిల్లలను గుర్తించారు. ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చి కూలీలుగా పనిచేస్తున్న వారి పిల్లలను గుర్తించి స్కూళ్లలో చేర్పించారు. తల్లిదండ్రుల చెంతకు చేర్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటుకబట్టీలు, హోటళ్లు, షాపులు, మెకానిక్ షెడ్లు తదితర ప్రదేశాల్లో పనిచేస్తున్న బాలకార్మికులనూ గుర్తించి బడిలో చేర్పించారు. చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ, లేబర్, ఎడ్యుకేషన్, చైల్డ్‌ప్రొటెక్షన్, హెల్త్‌డిపార్ట్‌మెంట్ల అధికారులు, సిబ్బందితో స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జిలు, షాపులు, మెకానిక్ షెడ్లు, ఇటుక బట్టీలు తదితర ప్రదేశాల్లో తనిఖీలు చేస్తూ చిన్నారులను గుర్తించి బాల్యానికి భరోసా కల్పించారు.

2017 నుంచి ఇప్పటిదాకా పోలీసులు గుర్తించిన చిన్నారులు

ఏడాది	బాలురు	బాలికలు	మొత్తం
2017	206	48	254
2018	88	04	92
2019	116	39	155
2020	66	05	71
2021	88	13	101
2022	21	11	32
2023	33	04	37
2024	56	14	70
2025	136	57	193

ప్రణాళిక పక్కాగా అమలు చేశాం



బాలకార్మిక వ్యవస్థ నుంచి చిన్నారులకు విముక్తి కల్పించేందుకు కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-11 విజయవంతమైంది. ఏసీపీ ఆధ్వర్యంలో ఒక్కో సబ్ డివిజన్‌కు ఒక ఎస్సైని నియమించి ప్రత్యేక బృందాలతో నిరంతరం తనిఖీలు చేశాం. బయట తిరుగుతున్న వారిని గుర్తించి స్కూళ్లలో చేర్పించాం. ఇందుకోసం పక్కా ప్రణాళిక అమలు చేశాం. – అంబర్ కిశోర్ ఝా, పోలీస్ కమిషనర్, రామగుండం

రైతులకు అందుబాటులో యూరియా

- ఆర్‌ఎఫ్‌సీఎల్ ద్వారా సరఫరా
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ప్రస్తుతం 2,270 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, బుధవారం (ఈనెల 6న) ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి మరో 3వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. అవసరం మేరకే కొనుగోలు చేయాలని, నిల్వ చేసి నష్టపోవద్దని ఆయన సూచించారు. బస్తీదవాఖానాలో షుగర్ నిర్ధారణ పరీక్షలకు అవసరమైన గ్లూకోమీటర్ పరికరాలను ఇప్పిస్తామన్నారు. పెద్దపల్లి శివారు రంగంపల్లిలోని బస్తీదవాఖానాను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు సూచనలు చేశారు. ఎన్‌సీడీ బాధితులకు ప్రతినెలా అవసరమైన మందులు అందించాలని, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గర్రెపల్లి పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీబీపీ మిషిన్‌ను వెంటనే మరమ్మతు చేయించాలని సూచించారు. డాక్టర్లు రామకృష్ణ, స్వప్న, సింధూజ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15 వరకు లక్ష్యం పూర్తిచేయాలి

పెద్దపల్లిరూరల్: వన మహోత్సవం లక్ష్యాన్ని ఈనెల 15వ తేదీ వరకు పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని తరచూ పర్యవేక్షించాలని, ఉపాధి పనుల్లో వేగం పెంచాలన్నారు. డీఆర్డీవో కాళిందిని, హౌసిగ్ పీడీ రాజేశ్వర్, జెడ్పీ సీఈవో నరేందర్, డీపీవో వీరబుచ్చయ్య పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర

- ప్రాజెక్టు నుంచి నీళ్లివ్వకనే పంటలు ఎండుతున్నయ్
- వచ్చే ఎన్నికల్లో ఓటుతోనే గుణపాఠం చెప్పాలి
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను చూస్తున్న నేతలు

పెద్దపల్లిరూరల్: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, ఆ ప్రాజెక్టులోని నీరంతా వృథాగా పోతోందని, ఇక్కడేమో సాగునీరందక, వానలు కురవక పంటలు ఎండుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్ ధ్వజమెత్తారు. మాజీమంత్రి హరీశ్‌రావు మంగళవారం చేపట్టిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను బీఆర్‌ఎస్ జిల్లా భవన్‌లో ఎల్‌ఈడీ ద్వారా లైవ్ టెలికాస్ట్ చేశారు. బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు ఆ కార్యక్రమాన్ని తిలకించారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలన్న దురాలోచనతోనే కాంగ్రెస్ నాయకులు సాగిస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ వాస్తవాలను ప్రజలకు వివరించాలని కోరుకంటి చందర్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై కోపంతోనే రైతులు సాగుచేసే పంటలకు నీరు ఇవ్వకుండా గోదావరి జలాలను వృథా చేస్తున్నారని పుట్ట మధుకర్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలను మాజీమంత్రి హరీశ్‌రావు ఆధారాలతో సహా వివరిస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. రెండు పిల్లర్లు కుంగితే వాటికి తాత్కాలిక మరమ్మతులు చేసి నీళ్లను ఆపాల్సిందిపోయి రైతులను అవస్థల పాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ పాలకులు కుమ్మక్కై పాలన సాగిస్తున్నారని ఆయన విమర్శించారు. నాయకులు కౌశిక హరి, గంట రాములు, రఘువీర్‌సింగ్, ఉప్పు రాజ్ కుమార్, గోపు ఐలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లిరూరల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు శ్యాం డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట మంగళవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. ప్రతీ పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని అన్నారు. సమ్మె కాలపు వేతనం చెల్లించాలని కోరారు. నాయకులు కుమారస్వామి, పోచయ్య, రాంకిషన్‌రావు, లక్ష్మణ్, సంతోష్ రెడ్డి, పర్శరాములు, శంషొద్దీన్, కిరణ్, కొమురయ్య, రాజు, ప్రకాశ్‌రావు, జనార్దన్, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, వసుంధర, పద్మావతి, వాసవి, స్వప్న, ప్రతాప్‌చారి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కొత్తబస్టాండ్‌లో గుర్తుతెలియని మృతదేహం


గుర్తుతెలియని మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల కొత్త బస్టాండ్‌లో గుర్తుతెలియని మృతదేహం కనిపించినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. వేములవాడ బస్ ప్లాట్‌ఫాం సమీపంలోని మరుగుదొడ్ల పక్కన వ్యక్తి మృతదేహం ఉందని, బూడిద రంగు టీషర్ట్, తెల్లపంచ కట్టుకుని ఉన్నాడని, మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని పేర్కొన్నారు. అతని సమాచారం తెలిసినవారు 87126 56815నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


శ్రావ్య(ఫైల్)

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శంకరపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రావ్య (27)కు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లికి చెందిన అమ్మిగల్ల ధర్మతేజ్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కొడుకు శ్రేయాన్స్‌నందన్ ఉన్నాడు. ధర్మతేజ్ రెండేళ్లక్రితం దుబాయ్ వెళ్లాడు. అప్పటినుంచి శ్రావ్య పుట్టింట్లో ఉంటోంది. సోమవారం రాత్రి దుబాయ్ నుంచి ధర్మతేజ్ శ్రావ్యతో వీడియోకాల్‌లో మాట్లాడాడు. ఇద్దరిమధ్య గొడవ జరగడంతో మంగళవారం వేకువజామున ఇంట్లో శ్రావ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శ్రావ్య సోదరుడు గొట్టె శివకృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

మానసికవేదనతో ఒకరు..

చిగురుమామిడి: చిగురుమామిడి మండలం ఇందుర్తికి చెందిన బల్ల బాలయ్య(50) మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. బాలయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గుండె సంబంధిత ఆపరేషన్ సైతం జరిగింది. కొద్దిరోజులుగా మానసిక వేదనకు గురవుతూ.. మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

మెట్‌పల్లి: పట్టణంలోని దుబ్బవాడకు చెందిన చిన్నారి జెట్టి మాన్విక్‌పై మంగళవారం కుక్కలు దాడి చేశాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న మాన్విక్‌పై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. బాలుడికి పలుచోట్ల గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని మొదట స్థానిక ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తీసుకెళ్లారు.

ఆటో బోల్తా ఘటనపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులో మంగళవారం స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న ఆటో బోల్తా పడిన సంఘటనపై విద్యార్థి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన మహమ్మద్ షబానా బేగం–రఫీక్ దంపతుల కుమారుడు మహమ్మద్ హర్షద్ రిజ్వాన్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నాడు. నిత్యం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన షేక్ మలాన్ ఆటోలో స్కూల్‌కు వెళ్లివస్తుంటాడు. అదే ఆటోలో మరో పాఠశాలకు చెందిన విద్యార్థులు వెళ్తుండడంతో వారిని ఆ స్కూల్‌లో దింపేందుకు ఎల్లారెడ్డిపేట శివారులోని గాయత్రి డిగ్రీ కాలేజీ ఎదుట ఆటోను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతోనే ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో హర్షద్ రిజ్వాన్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లెకు సౌరవెలుగులు

- సోలార్ పవర్ ఉత్పత్తిపై గ్రామీణుల ఆసక్తి
- విద్యుత్ చార్జీల ఆదా.. అదనపు ఆదాయం
- పీఎం సూర్యఘర్ స్కీంకు పెరుగుతున్న డిమాండ్


ఉప్పట్లలో భవనంపై అమర్చిన సోలార్ ప్యానెల్స్

మంథనిరూరల్: ఆధునిక సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దీనిని సొంతం చేసుకోవడంలో పల్లెవాసులూ ఆసక్తిచూపుతున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటివరకు పట్టణాలకే పరిమితమైన సోలార్ పవర్ తయారీ, వినియోగం పద్ధతులు గ్రామాలకూ విస్తరిస్తున్నాయి. విద్యుత్ చార్జీల భారం తగ్గించుకునేందుకు పల్లెప్రజలు సోలార్ పవర్‌పై ఆసక్తి చూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా సోలార్ ప్యానెల్స్ అమర్చుకుంటున్నారు.

ఇంటికి 300 యూనిట్లు ఉచితం..

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా సోలార్ సిస్టం అమర్చుకుంటే ఇంటికి 300 యూనిట్లు ఉచితంగా అందించేలా రూపకల్పన చేశారు. దీంతో విద్యుత్ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు.

చార్జీల ఆదా.. అదనపు ఆదాయం..

సోలార్ పవర్ తయారీ సిస్టమ్ అమర్చుకుంటే ప్రస్తుత విద్యుత్ చార్జీలు ఆదా అవుతాయి. ఈ ప్యానెల్స్ ద్వారా నెలకు 300 యూనిట్ల నుంచి 500 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇందులో 200 – 300 యూనిట్ల వరకు గృహావసరాలకు వినియోగించుకోవాలి. మిగిలిన విద్యుత్‌ను ఎన్పీడీసీఎల్ ఒక్కో యూనిట్‌కు రూ.4 చెల్లించి కొనుగోలు చేస్తుంది. ఒకవైపు విద్యుత్ చార్జీల భారం తగ్గడం, మరోవైపు విద్యుత్ విక్రయం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుండడంతో పల్లెవాసులు తమ ఇళ్లపై సోలార్ పవర్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు.

కేంద్రప్రభుత్వం నుంచి రాయితీ..

కేంద్రప్రభుత్వం గతేడాది ప్రవేశ పెట్టిన సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా రాయితీ వర్తింపజేస్తోంది. 3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ సిస్టం అమర్చుకుంటే రూ.78 వేలు, 2 కిలోవాట్లు అయితే రూ.60 వేలు, ఒక కిలోవాట్ అయితే రూ.30 వేల వరకు సబ్సిడీ అందిస్తోంది. దీనికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, నెలసరి విద్యుత్ బిల్లు, ఇంటి యజమాని ధ్రువీకరణ పత్రం ఉంటే చాలు. దరఖాస్తు ఆమోదం తర్వాత ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ అమర్చుతారు.


సోలార్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే సిస్టం

కరెంట్ చార్జి తగ్గుతుంది



రోజురోజుకూ కరెంట్ చార్జీలు పెరుగుతున్నయ్. ఎండకాలంలో రూ.వేలకు వేలు కట్టాల్సి వస్తోంది. కరెంటు చార్జీల భారం తగ్గుతుందనే ఆలోచనతో సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకున్న. ప్రస్తుతం బాగానే పనిచేస్తుంది.

– ముత్యాల లింగయ్య, ధర్మారం, మంథని

అదనపు ఆదాయం



గృహావరాలకు ఉచితం. అదనపు ఆదాయం వస్తుందనే ఆలోచనతో సోలార్ సిస్టం తీసుకున్న. సబ్సిడీ కూడా వస్తుంది. ఇంట్లో మేం వాడుకోగా మిగలిన సోలార్ కరెంట్‌ను అధికారులు తీసుకుని మాకు పైసలు ఇస్తున్నరు.

– బడికెల సతీశ్, ఉప్పట్ల, మంథని

ఘనత సాధించిన తండ్రీకొడుకులు

- యూరప్‌లో ఎత్తయిన శిఖరం అధిరోహణ
- అభినందించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష


వివేకానందరెడ్డి, మహిపాల్‌రెడ్డిని అభినందిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: యూరప్ ఖండంలోనే అత్యంత ఎత్తయిన శిఖరం మౌంట్ ఎల్బ్రోస్ 5,642 మీ ఎత్తు (18,150 అడుగులు) పర్వతశిఖరాన్ని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన వివేకానందరెడ్డి, ఆయన తండ్రి మహిపాల్‌రెడ్డి అధిరోహించారు. దీంతో కలెక్టరేట్‌లో మంగళవారం తండ్రీకొడుకులను కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు.

తండ్రిబాటలో తనయుడు..

మాజీ సైనికోద్యోగి అయిన లెంకల మహిపాల్‌రెడ్డి ఇప్పటికే పలు దేశాల్లోని 12 పర్వతాలను అధిరోహించి ఇంటర్నేషనల్ మౌంటనీర్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. తన బాటలోనే తనయుడు వివేకానందరెడ్డిని కూడా పర్వతారోహకుడిగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో గతేడాది శిక్షణ ఇచ్చారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని పతాల్సు పర్వతాన్ని వివేకానందరెడ్డి అధిరోహించారు. తండ్రి ఇచ్చిన శిక్షణతోనే యూరప్‌లో అత్యంత ఎత్తయిన పర్వతాన్ని ఈనెల 3న అధిరోహించారు.

సే నో టు డ్రగ్స్ బ్యానర్ ఆవిష్కరణ

యూరప్‌లోని పర్వతాన్ని అధిరోహించిన వివేకానందరెడ్డి.. అక్కడ సే నో టు డ్రగ్స్ అనే బ్యానర్ ఆవిష్కరించారు. గతనెల 28న రష్యాకు చేరుకుని అక్కడే ఐదురోజుల పాటు శిక్షణ పొందినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణంలోనూ మాస్టర్ వివేకానందరెడ్డి ధైర్యసాహసాలతో పర్వతాన్ని అధిరోహించడం అభినందనీయమని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో పర్వతాలను అధిరోహించి రికార్డు సృష్టించి తెలంగాణ రాష్ట్రానికి, భారతావనికి కీర్తిప్రతిష్టలు తేవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

భూవివాదంతోనే వృద్ధుడి హత్య

- ఇద్దరు నిందితుల అరెస్టు
- మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్

మల్లాపూర్: భూ వివాదంతోనే మండలంలోని వేంపల్లికి చెందిన వృద్ధుడు సకినపెల్లి కాశీం(60)ను హత్యచేసినట్లు పోలీసులు గుర్తించారు. హత్యలో నిందితులైన నానం హన్మాండ్లు, ఆయన కుమారుడు నానం రాకేశ్‌ను అరెస్టు చేశారు. సంఘటన వివరాలను మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్ మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. హన్మాండ్లు 15ఏళ్ల క్రితం కొన్న భూమి పక్కనున్న బావిని పూడ్చేందుకు ప్రయత్నించారు. దీనికి కాశీం అడ్డుపడ్డాడు. అప్పటినుంచి వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. కాశీం బాత్‌రూం విషయంలోనూ గొడవ జరుగుతోంది. పంచాయితీ జరిగినా పరిష్కారం కాలేదు. దీంతో కాశీంను హత్య చేయాలని హన్మాండ్లు, రాకేశ్ నిర్ణయించుకున్నారు. కాశీం అతడి పెద్ద కుమారుడి ఇంట్లో భోజనం చేసి వెళ్తుండగా అప్పటికే సిద్ధం చేసుకున్న కర్రతో ఈనెల 2న రాత్రి 7.30 గంటల సమయంలో దాడి చేశారు. కాశీం మృతి చెందిన తర్వాత హన్మాండ్లు, రాకేశ్ బైక్‌పై పరారయ్యారు. కాశీం కుమారుడు లక్ష్మీనర్సయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై రాజు ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేపట్టారు. మంగళవారం గోధూర్ చౌరస్తాలో నిందితులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి హత్యకు ఉపయోగించి కర్ర, బైక్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి

- క్వారీ యజమాని, ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

మానకొండూర్: ఇసుక లారీ ఢీకొని చనిపోయిన మానకొండూర్ మండలం మద్దికుంట గ్రామానికి చెందిన కెక్కర్ల సురేశ్ కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని, ప్రమాదానికి కారణమైన ఊటూరు ఇసుకక్వారీ యజమానులు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై కేసు నమోదు చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. మానకొండూర్‌లో మంగళవారం మాట్లాడుతూ.. కెక్కర్ల సురేశ్ కరీంనగర్‌లోని ఓ ట్రాక్టర్ షోరూంలో పనిచేస్తూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండేవాడన్నాడు. పోచంపల్లి వద్ద ఇసుక లారీని ఢీకొని చనిపోయాడని తెలిపారు. సురేశ్‌ను అంబులెన్సులో కరీంనగర్ తీసుకెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. రహదారి వెంట ఇసుక లారీలు నిలిపేందుకు ఎవరు అనుమతి ఇచ్చారని మండిపడ్డారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కనీసం పరామర్శించలేదన్నారు. మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, పిట్టల మధు, నెల్లి శంకర్, గుర్రం కిరణ్ గౌడ్, గడ్డం సంపత్, నెల్లి మురళి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో ముగ్గురు మృతి

- మృతుల నేత్రాలు దానం
- ఆరుగురు అంధులకు చూపు


అమృతలాల్ చౌడ(ఫైల్)


తాండూరి శ్రీనివాస్(ఫైల్)


వెల్పుల సాయిలు(ఫైల్)


తాండూరి శ్రీనివాస్ కుటుంబాన్ని ఓదారుస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో సోమవారం రాత్రి ముగ్గురు గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ పెద్దను కోల్పోయిన విషాదంలో కూడా ఆ మూడు కుటుంబాలు.. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో ముగ్గురి నేత్రాలను దానం చేశారు. ఆరుగురు అంధులకు కంటి వెలుగులు ప్రసాదించేలా సహకరించారు. ఈ ముగ్గురిలో సమీప బంధువు తాండూరి శ్రీనివాస్ పార్థివదేహాన్ని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం సందర్శించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ముగ్గురి చూపు.. ఆరుగురికి కంటి వెలుగులు..

జవహర్‌నగర్‌కు చెందిన తాండూరి శ్రీనివాస్(49) సింగరేణిలోని ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో స్టేనోగా పనిచేస్తున్నాడు. ఛాతీలో నొప్పి ఉందంటూ కుప్పకూలిపోయాడు. వెంటనే గోదావరిఖని గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. శ్రీనివాస్ నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ కార్పొరేటర్ ఎండీ ముస్తాఫా నివాళి అర్పించారు. అదేవిధంగా దుర్గానగర్‌కు చెందిన సీనియర్ వ్యాపారి అమృత్‌లాల్ చౌడ(78) హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన 55 ఏళ్లుగా హార్డ్‌వేర్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. మృతుడి నేత్రాలను కుమారుడు, కోడలు జయప్రకాశ్ చౌడ–కవిత, మనమలు కౌశల్, నివేద్ దానం చేశారు. మరోవైపు.. ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి వెల్పుల సాయిలు(70) సింగరేణి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మృతుల కుటుంబాలను సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్, స్ఫూర్తి క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

దైవదర్శనానికి వెళ్లి తిరిగొస్తూ..

- ఐలాపూర్ శివారులో రోడ్డు ప్రమాదం
- చెట్టును ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు


గాడిపెల్లి నరేశ్ (ఫైల్)


చెట్టును ఢీకొట్టిన కారు

కోరుట్లరూరల్: దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని అయిలాపూర్ శివారులో మంగళవారం ఉదయం నాలుగు గంటలకు చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. అయిలాపూర్‌కు చెందిన గాడిపెల్లి నరేశ్ (36) కొంతకాలంగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. 20రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. ఇంట్లో పండగలన్నీ చేసుకున్నారు. ఈనెల 10న తిరిగి గల్ఫ్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. సోమవారం ఉదయం తోడళ్లుడు బొల్లపెల్లి శ్రీనివాస్ కారులో రెండు కుటుంబాలు కలిసి యాదగిరి, స్వర్ణగిరి ఆలయాలను దర్శించుకున్నారు. రాత్రిసమయంలో తిరుగు పయనమయ్యారు. రెండు నిమిషాలైతే ఇంటికి చేరేదే.. ఆలోపే అయిలాపూర్ శివారు సబ్‌స్టేషన్ సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. బొల్లెపల్లి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీనివాస్ భార్య సుజాతకు రెండు కాళ్లు, ఓ చేయి విరిగింది. నరేశ్ భార్య సరితకు రెండు చేతులు విరిగాయి. నరేశ్ కుమారుడు, కూతురు, శ్రీనివాస్ కూతురును జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. నరేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చిరంజీవి తెలిపారు.

వినూత్నంగా.. ఉపాధి పక్కాగా..

- కుర్తాలు, లాల్చీల తయారీ
- మరో నలభై మందికి ఉపాధి
- స్వయంకృషితో రాణిస్తున్న మధు





సిరిసిల్లకల్చరల్: పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలి.. అని పెద్దలు చెప్పిన మాటలను నమ్మి ముందుకెళ్లి విజయం సాధించాడు భైరి మధు. తన తప్పేమి లేకున్నా చేస్తున్న వ్యాపారంలో నష్టం రాగా.. అదే రంగంలో వినూత్నంగా ఆలోచించి ఉపాధి పక్కాగా చేసుకున్నాడు. మరో 40 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన మధు తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం భీవండిలో స్థిరపడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో తిరిగి సిరిసిల్ల సమీపంలోని చంద్రంపేటకు వచ్చాడు. తన రెక్కల కష్టంతో రెండు కార్ఖానాలు నిర్వహించే స్థాయికి ఎదిగాడు. అయితే కరోనా మహమ్మారి కారణంగా నష్టపోయాడు. పడిన చోటే తిరిగి లేవాలని భావించి.. చేనేత రంగంలోని వినూత్నంగా ఆలోచించాడు. ఇప్పుడు 40 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు.

కరోనాతో కొత్త జీవితం

కరోనా నియంత్రణకు మాస్కులు ధరించడం తప్పనిసరైన నేపథ్యంలో మాస్కుల తయారీపై దృష్టి సారించిన మధు కరీంనగర్, వరంగల్ జిల్లాల వరకు సరఫరా చేశాడు. సంక్షోభం ముగిసి సమాజం సాధారణ స్థితికి చేరేసరికి మధుకు ప్రత్యామ్నాయ వ్యాపారం జాడ దొరికింది. జాతీయ జెండాల రూపకల్పన, బ్యానర్లతోపాటు పండుగల సందర్భంగా ప్రస్తుతం ఉపయోగిస్తున్న కండువాలు తయారు చేయడం ప్రారంభించాడు. గత ఐదేళ్లుగా వస్త్రం కొనుగోలు చేయడం, రంగులు అద్దించడం తోపాటు వాటిని ఆర్డర్ల మేరకు కండువాలు, తయారు చేయిస్తున్నాడు. కృష్ణాష్టమి, వినాయక చవితి వంటి సామూహిక ఉత్సవాల్లో ఉపయోగించే లాల్చీలు, కుర్తాలు కుట్టించి విక్రయిస్తున్నాడు. వివాహాది శుభకార్యాల సందర్భంగా ఆయా కార్యక్రమాల నిర్వాహకులు ఏకరీతిగా ఉండే కుర్తాలు ధరిస్తుంటారు. అదే అదనుగా హల్దీ, సంగీత్ వంటి ఉత్సవాలకు అవసరమైన కుర్తాలు తయారు చేయించి అమ్ముతున్నాడు.

మరో 40 మందికి ఉపాధి

మధు తాను ఉపాధి పొందడంతోపాటు మరో 40 మందికి కుర్తాలు కుట్టే పనిలో ఉపాధి ఇస్తున్నాడు. ఒక్కొక్కరు వారి పని తీరు ఆధారంగా రోజుకు కనీసం రూ.300 సంపాదిస్తున్నారు. మధు చేస్తున్న పనికి ఆయన సతీమణి శ్యామల సైతం తోడుగా నిలుస్తోంది.

కరోనా నేర్పిన దారి



కోవిడ్ మహమ్మారి కారణంగా చేస్తున్న వ్యాపారం నష్టపోయాను. మాస్కులు ధరించడం తప్పనిసరి అనే ప్రచారంతో మాస్కులు తయారు చేయించి ఊరూరా తిరిగి అమ్మేవాన్ని. టీవీఎస్ ఎక్సెల్ బండిమీద పలు జిల్లాల్లో మాస్కులు విక్రయించాను. మెలగా కరోనా పీరియడ్ తరువాత ఈ కుర్తాలు, జెండాలు, కండువాలు తయారు చేయించి విక్రయిస్తున్నాను.

– భైరి మధు, తయారీదారుడు

కొన్నేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నా



కొంతకాలంగా కుర్తాలు, లాల్చీలు కుట్టడం కోసం ఇక్కడే పనిచేస్తున్నాను. రోజుకు 30 నుంచి 40 వరకు లాల్చీలు కుట్టగలుగుతున్నాను. రోజుకో రూ.400 చొప్పున నెలకు రూ.12వేలు వరకు ఆదాయం వస్తోంది.

– సిరిపురం లక్షణ

ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ప్రథమ బహుమతి


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 3వ తరగతి విద్యార్థి మరియం భాను ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ప్రథమ బహుమతి సాధించినట్లు పీడీ సుంకరి మురళీధర్ తెలిపారు. ఈ నెల 3న స్వదేశ్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభను ప్రదర్శించి ప్రథమ బహుమతి, రూ.10వేల నగదు గెలుచుకున్నట్లు వివరించారు. మంగళవారం విద్యార్థినిని పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్ అభినందించారు.

అంజన్న సన్నిధిలో శ్రావణ సందడి


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


సామూహిక అభిషేకాలు చేస్తున్న భక్తులు


వీల్‌చైర్‌లో అంజన్న దర్శనం కోసం వస్తున్న భక్తురాలు


ఆలయ పరిసరాల్లో భక్తులు

మల్యాల: మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ సందడి నెలకొంది. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. సామూహిక అభిషేకాలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. టికెట్లు, లడ్డూ విక్రయాల ద్వారా రూ.4.56లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఆలయ ఈఓ శ్రీకాంత్‌రావు, సునీల్‌కుమార్, చంద్రశేఖర్, హరిహరనాథ్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.